ప్రజాశక్తి
బుధవారం 17 జులై 2024 5
శ్రీ సత్యసాయి





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పంటల బీమా వచ్చేనా..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో రైతులు పంట నష్టపోయారు. కరువు మండలాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. వర్షాభావంతో పెట్టిన పంట చేతికందక రైతులు నష్టపోయిన దానికి పంటల బీమా ఇంత వరకు రాలేదు. గతేడాది నష్టం ఈ సీజన్ ప్రారంభంలోనైనా వస్తుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా లేదు. కొత్త ప్రభుత్వమైనా ఇస్తుందో లేదో కూడా స్పష్టత లేదు. అంతకు మునుపు ప్రభుత్వం కూడా ప్రకటించలేదు. ఇస్తుందో.. లేదో.. కూడా ప్రకటన లేదు. వరుస నష్టాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ సహాయం అయినా అందితే బాగుంటుందని ఆశిస్తున్నారు.

1.79 లక్షల హెక్టార్లలో పంటనష్టం

అనంతపురం జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 2.49 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో 1.79 లక్షల హెక్టార్లలో పంటనష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఈ మేరకు రూ.251 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని ఇచ్చింది. అయితే పంటలబీమా మాత్రం ఇప్పటికీ మంజూరవలేదు. ఎంత జిల్లాకు



గతేడాది సాయం కోసం రైతుల ఎదురుచూపు

మంజూరవుతుందోనన్నది ప్రకటన కూడా వెలువడలేదు. వేరుశనగ 81,707 హెక్టార్లలో రూ.138 కోట్లకు ప్రతిపాదించారు. ఆముదం రూ.18.96 కోట్లు కలిపి మొత్తం రూ.251కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. వాతావరణ బీమా మాత్రం ఇప్పటికీ మంజూరవలేదు. జిల్లాలో 28 మండలాల్లో గతేడాది తీవ్ర వర్షాభావంతో పంటనష్టం జరిగింది. ఈ ఏడాది అదే వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది పంటలబీమా అయినా మంజూరయితే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

బీమా మంజూరు చేయాలి

చంద్రశేఖర్‌రెడ్డి ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంటనష్టానికి సంబంధించి పంటలబీమాను ప్రభుత్వం ప్రకటించాలి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. ప్రభుత్వం బీమా ఎంత వరకు ఇస్తుందో కూడా చెప్పలేదు. ప్రీమియం అయితే ప్రభుత్వం చెల్లించిందని చెబుతున్నారు. బీమా ఇచ్చి ఆదుకోవాలి. ఈ ఏడాది కరువు పరిస్థితులే నెలకొన్నాయి. పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం

కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలి
కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటికి గ్రామస్థాయిలోనే పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులకు సూచించారు. మంగళవారం నాడు కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, డిఆర్‌డిఎ, డ్వామా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏ పనులు చేపడుతున్నారన్న దానిపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మేజర్ పంచాయతీలో ఎలాంటి పనులు చేపడుతున్నారు.. క్షేత్రస్థాయిలో పనులు ఏ విధంగా జరుగుతున్నాయో అన్న విషయాలపై ప్రతిరోజూ నివేదికలు అందజేయాలని డిపిఒను ఆదేశించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం, గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు నిర్వహించి కమిటీ మెంబర్లు, సర్పంచులు, ఈవో పీఆర్డీలు, ఎంపీడీవోలు సమస్యలను చర్చించి అభివద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు పరిశీలించి మెరుగుపరచాలన్నారు. తాగునీటి సరఫరా, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వాటిని మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. 15వ ఫైనాన్స్ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నిధులు, జనరల్ ఫండ్ కింద జిల్లాకు ఎంత కేటాయించారన్న దానిపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ముందు వరుసలో ఉండే విధంగా డ్వామా సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. చెరువులు పూడిక తీత పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. అమత సరోవర్ పథకం ద్వారా జిల్లాలో చెరువులు నిర్మించాలని, ఫారం ఫండ్స్, మొదలైన పనులు చేపట్టాలని ఆదేశించారు. సామాజిక భద్రత పింఛన్లను ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలను పాటించి అర్హులందరికీ అందించాలన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని అందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎంపిడిఒలు, మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో లలితబాయి, డిపిఒ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జునప్పతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలురైతు మృతి

ప్రజాశక్తి- కుందుర్పి

పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాకుతో యువ రైతు మృతి చెందిన సంఘటన కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బెస్తరపల్లి గ్రామానికి చెందిన చాకలి దేవరాజు(36) తూముకుంట తలారి ఆనంద్‌కు సంబంధించిన పొలాన్ని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. విద్యుత్ మోటార్‌కు సంబంధించిన స్టార్టర్‌ను ముట్టుకోగానే కరెంట్ షాక్ తగిలి అక్కడకక్కడే మతి చెందాడు. తోటి రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అక్కులప్ప తెలిపారు.

యువ రైతు మృతి విషయం తెలుసుకున్న వైసిపి యువ నాయకుడు ఎస్.బాబు మృతుని కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపి తలారి రంగయ్య పరామర్శించారు. బెస్తరపల్లి సర్పంచి కొమ్ము మమత, సీనియర్ నాయకుడు కొమ్మ హనుమంతరాయుడు, ఎంపీటీసీ కవిత ఓబులేష్, మాజీ డీలర్ రామదాసు, వైసిపి నాయకులు, లెనిన్ బాబు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.





విద్యుత్ షాక్‌తో పొలంలోనే మృతిచెందిన దేవరాజు (ఇన్‌సెట్‌లో దేవరాజు ఫైల్ ఫొటో)

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

- జిల్లాలో 5 స్టాక్ పాయింట్ల ద్వారా సరఫరా
- ఫిర్యాదులకు కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నెంబర్
- కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ మైనింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత ఇసుక విధానంపై డీఎల్ఎస్‌సి సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా మైన్స్, జియాలజీ అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వినియోగదారులకు ఈ నెల 8వ తేదీ నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. ఇంకా 35 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. నదీ పరివాక ప్రాంతాల్లో ఇసుక పూడిక తీత కార్యక్రమాలు త్వరితగతన చేపట్టేందుకు సంబంధిత శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీలోపు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక నిల్వచేసిన డంపింగ్ యార్డ్‌లో సీసీ కెమెరాలు, అవసరమైన సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున ఉప్పలపాడు, కొడవండ్లపల్లి, నల్లబోయినపల్లి, కుటగుళ్ళ, రామగిరి ప్రాంతాల్లో 35 వేల మెట్రిక్ టన్నుల నిల్వ ఉంచామన్నారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదులు, సలహాల కోసం కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6041ను ఏర్పాటు చేశామన్నారు. మైన్స్ విభాగానికి ఇసుక సమస్యలు, ఫిర్యాదులపై అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి వంశీకష్ణ, ధర్మవరం వెంకట శివ సాయి రెడ్డి, అధికారులు ప్రతాప్, కృష్ణారెడ్డి, క్రాంతి శేఖర్‌రెడ్డి, మల్లికార్జునప్ప పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకం సక్రమంగా అమలు చేయాలి

విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ విద్యాధికారులను ఆదేశించారు.



అధికారులో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

మంగళవారం స్థానిక కలెక్టరేట్లోనే మినీ కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లాలో విద్య, సంక్షేమ వసతి గహాలు, సర్వ శిక్ష అభియాన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, బిసి సంక్షేమ అధికారి నిర్మలాదేవి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. గుడ్లు, చిక్కీ, రాగి జావా సక్రమంగా అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించాలన్నారు. పాఠశాలల్లో అందిస్తున్న పోషకాహారం తీసుకోకపోవడం వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు రక్తహీనత(అనీమియా)తో పాటు ఇతర పోషకాహార లోప సమస్యలు తలెత్తవన్న విషయాలను తెలియజేయాలన్నారు. వంట చేసే ప్రదేశం శుభ్రంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణపై అధికారులు తరచుగా పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆ సమయంలో గుర్తించిన రిమార్కులను తనకు సమర్పించాలన్నారు. వసతి గహ విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవసరమైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. సంక్షేమ వసతి గహ అధికారులు క్షేత్రస్థాయిలో వసతి గహాలు సందర్శించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా కషి చేయాలని తెలిపారు.



పోస్టాఫీసు వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

పేదల సొమ్ముతో పోస్ట్‌మ్యాన్ ఉడాయింపు..!

పోస్టాఫీసు వద్ద బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-నల్లమాడ

నల్లమాడ పోస్టాఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న పోస్టుమ్యాన్ చేతివాటం ప్రదర్శించారు. పోస్టల్ ఖాతాల్లో పొదుపు ఖాతా ఉన్న వారి డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంతంగా వాడుకున్నారు. దాదాపు రూ.30 లక్షల వరకు వాడేసి ఎవరికి కన్పించకుండా పారిపోయాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితులు మంగళవారం ఉదయం పోస్టాఫీసు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు వారికి జరిగిన అన్యాయాన్ని విలేకరులకు తెలియజేశారు. నల్లమాడ పోస్టాఫీస్‌లో పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ నాయక్ కొండకిందతండాకు చెందిన ఖాతాదారుల దగ్గర నుంచి డబ్బులు కట్టించుకుని వారి ఖాతాల్లో జమ చేయకుండా తన సొంత ప్రయోజనం వాడుకున్నాడన్నారు. దాదాపు 300 మందికి చెందిన డబ్బులను ఇలా కాజేశారని చెప్పారు. ఇంట్లో డబ్బులు ఉంటే దొంగలు ఎత్తుకెళ్తారని భావించి ఇలా పోస్టాఫీసులో ఉంచుదామంటే పోస్టుమ్యాన్ ఇలా చేశాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దాపు రూ.30 లక్షల సొమ్ము కాజేసి వెళ్లాడన్నారు. తమకు న్యాయం చేయాలని పోస్టాఫీసులో అడిగితే ఎవరూ సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. దాదాపు రెండు వారాలుగా పోస్టాఫీసు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై పోస్టాఫీసులో ఇన్‌ఛార్జి అధికారిగా విధులు నిర్వహిస్తున్న దుర్గాదేవి మాట్లాడుతూ జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఖచ్చితంగా బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులు మాత్రం తమకు న్యాయం జరగకుంటే పోస్టఫీసు వద్దనే మూకుమ్మడి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఎంపిడిఒ కార్యాలయం రోడ్డు బురదమయం..!

ప్రజాశక్తి-నల్లమాడ

నల్లమాడ ఎంపిడిఒ కార్యాలయం ముందు రోడ్డు బురదమయంగా మారింది. దీంతో కార్యాలయంలోకి వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు బురద రోడ్డులో తొక్కుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం నాడు కురిసిన చిన్నపాటి వర్షానికి ఈ రోడ్డుపై నీరునిలిచింది. కార్యాలయం ముందు సిసి రోడ్డు వేయించాలని స్థానికులు కోరినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారుల స్పందించి రోడ్డుపై నీటి గుంతలు పూడ్చి శాశ్వత చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న రోడ్డు

ముందస్తు ప్రణాళికతో విజయం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ముందస్తు ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని ముందుకు వెళితే ప్రతి ఒక్కరూ ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చుననిజిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో మొట్టమొదటిసారిగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించగానే తన ముందు ఎన్నో సవాళ్లు ఉంటాయనుకున్నానని అయితే అందరి సహకారం వల్లే అన్ని సవాళ్లను అధిగమించి అన్నింటాజిల్లాను ఒక విజయ పథంలో నడిపించామని చెప్పారు. మంగళవారం పుట్టపర్తి లోని సాయి ఆరామంలో జిల్లా నుండి బదిలీపై (పార్వతిపురం) మన్యం జిల్లాకు వెళుతున్న జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డికి జిల్లా అదనపు ఎస్పీ ఎన్ విష్ణు అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐ లు, ఎస్‌బి, డిపిఒ, ఎఆర్ స్పెషల్ పార్టీ, సేబ్, ట్రాన్స్‌పోర్టు తదితర అధికారులు గజమాలలతో ఎస్పీని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో ప్రధానంగా ప్రతి ఒక్కరు చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రతి పనిలో పూర్తిగా అవగాహన చేసుకున్నప్పుడే అన్నింటా సక్సెస్ అవుతారని అన్నారు. జిల్లాకు నూతనంగా వచ్చే అధికారులకు కూడా సహాయ సహకారాలు అందించి జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెబ్ సుబ్రహ్మణ్యం, ఎఆర్ డిఎస్పి విజయ్ కుమార్ , దిశా డిఎస్పి శ్రీనివాసరావు, జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీని సన్మానిస్తున్న పోలీసు అధికారులు, ఉద్యోగులు



ఎస్ఐతో మాట్లాడుతున్న నాయకులు

నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - సోమందేపల్లి

పెనుకొండ మండలంలోని సుద్ధబట్లపల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా జిల్లా అధ్యక్షులు హను మయ్య ,జిల్లా కార్యదర్శి రమణ,సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన దళిత మహిళ మీనా ఆమె భర్త గొడవలు పడుతుండగా అదే గ్రామానికి చెందిన వెంకటేష్ ,రఘు, చంద్ర దళిత మహిళ మీనాపైనా, ఆమె భర్త పైనా దాడి చేశారన్నారు. ఈ దాడిలో గాయపడ్డ భార్యాభర్త పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం పరామర్శించామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ రాజుతో మాట్లాడి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల కేంద్రంలో ప్రబలిన డెంగీ, మలేరియా వ్యాధులను వెంటనే అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారం రోజులుగా ప్రజానీకం సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. సంబంధించిన అధికారులు సరైన చర్యలు తీసుకోవటం లేదని విమర్శించారు. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి మండల కేంద్రంలో పారిశుధ్య చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాళ్ల అంజి, ముత్యాలు, పెద్దన్న, శంకర్ రెడ్డి, నాగమణి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేడు తొలిఏకాదశి వేడుకలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో తొలిఏకాదశి వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పుష్పాలంకరణలో వాసవీమాత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కెపి స్ట్రీట్‌లోని కన్యకాపరమేశ్వర ఆలయంలో కమల పుష్పాలతో వాసవీమాతను అలంకరించారు ఆషాడమాసం సందర్భంగా వాసవి మహిళ మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

18 నుంచి ఇంటింటి సర్వే

గాండ్లపెంట : ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించాలని స్థానిక వైద్యాధికారులు మహేశ్వరి, భారతి, ఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎం, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ కుమార్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రెడ్డి కుమార్ రెడ్డి మాట్లాడుతూ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే కుష్టు వ్యాధి గ్రహిస్తులను ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు ఇంటింటికి వెళ్లి గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఉపేంద్ర, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సంత వేలం

ప్రజాశక్తి గోరంట్ల

స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచి సరోజా నాగే నాయక్, గ్రామ కార్యదర్శి సమక్షంలో కూరగాయల సంత వేలంపాటను మంగళవారం నిర్వహించారు ఈ వేలంపాటలో 16 మంది పాల్గొన్నారు. సర్కారు పాట రూ. 19 లక్షలు నిర్ణయించగా నాగరాజు సంత దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి రాజారెడ్డి. వార్డు మెంబర్లు పాల్గొన్నారు

ఘనంగా పెద్దసరిగెత్తు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కొత్తపేట సర్కిల్లో పెద్దసరిగెత్తును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్, హుస్సేన్, ఇమామీ, ఖాశీం, మౌలాలి, బాబావలి, జలాలిటోపీ సాహెబ్ పీర్లస్వాములను కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బిల్లే శీనయ్య, మాబు, చంద్ర, హుస్సేన్, సుబహాన్ పాల్గొన్నారు.

బత్తలపల్లి : బొప్పేపల్లి కాశీంస్వామి మొహర్రం ఉత్సవాలలో భాగంగా మంగళవారం పెద్ద సరిగెత్తు ఘనంగా జరిగింది. మొహరం ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలుగ్రామాలలో పీర్లమకాన్ వద్ద పెద్దసరిగెత్తు వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు.

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలో మద్దనకుంట, తమ్మడేపల్లి, వలస, అగ్రహారం సచివాలయాలను ఎంపీడీవో భాస్కర్ మంగళవారం తనిఖీ చేశారు .ఈ సందర్భంగా సచివాలయంలోని సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో సమావేశమై పారిశుధ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ముత్యాలమ్మ జాతర

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని మేడాపురం రోడ్డు ఎల్‌సికె పురంలోని ముత్యాలమ్మకు బోనాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయన గారి నర్సింహారెడ్డి మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగిన ఈ బోనాల వేడుకలను విజయవంతం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, మురళీమోహన్‌రెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో ఐదవ అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత అధ్యక్షతన బేటి బచావో బేటి బడావో కమ్యూనిటీ లెవెల్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ డిస్టిక్ కౌన్సిలర్ శివలత, హౌటు రీచ్ వర్కర్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలల హక్కులు, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, మంజుల, మహిళలు పాల్గొన్నారు.

డీలర్‌షిప్ కోసం తెలుగు తమ్ముళ్ల పోటీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మధ్యాహ్న భోజనం ఏజెన్సీ, కోడి గుడ్లు సరఫరా, చౌకధాన్యపు డీలర్‌షిప్ కోసం తెలుగు తమ్ముళు పోటీ పడుతున్నారు. తమకే డీలర్‌షిప్ కావాలంటూ కార్యకర్తలు, దిగువశ్రేణి నాయకులు టిడిపి కార్యాలయానికి క్యూ కడుతున్నారు. గత వారం నుంచి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి కార్యకర్తలు నాయకులు ఎవరికి వారు తమకే డీలర్‌షిప్‌లు దక్కాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చుట్టూ తిరుగుతున్నారు. ఎమ్మెల్యే గా ఎన్నికైన పల్లె సింధూర రెడ్డి రాజకీయాలకు కొత్త కావడం, పూర్తిగా నియోజకవర్గంలో పట్టు లేకపోవడంతో ఆమె మామగారైన పల్లె రఘునాథ్ రెడ్డి చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ పదవుల కోసం గ్రామాల్లో టిడిపి లోనే గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. చివరకు డ్వాక్రా సంఘాలకు పుస్తకాలు రాసే వివో పదవికి సైతం గ్రామాల్లో తమ వారికే కేటాయించాలంటూ పట్టు పడుతున్నారు. ఈ పదవుల కోసం ఎవరి వర్గం వారి నాయకులపై ఒత్తిడి అధికమైంది. దీంతో ఈ పోస్టుల భర్తీకి పల్లె రఘునాథ్ రెడ్డి తల పట్టుకోవాల్సి వస్తోంది. ఈ చిన్న చిన్న పోస్టుల వల్ల గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు నాయకుల మధ్య వర్గ రాజకీయాలకు దారితీస్తోంది. పల్లె రఘునాథ్ రెడ్డిపై కొందరు అలిగి వెళుతున్న సంఘటనలు సైతం బయటపడుతున్నాయి. నియోజకవర్గంలో దాదాపు 200 వరకు డీలర్ షిప్పులు ఉన్నాయి. ఒక మధ్యాహ్నం భోజనం ఏజెన్సీల కోసం, పాఠశాలలకు గుడ్డు పంపిణీ ఏజెన్సీ కోసం గ్రామాల్లో వివోల నియామకం కోసం ఎవరిని నొప్పించకుండా గ్రూపు రాజకీయాలు తలెత్తకుండా పల్లె రఘునాథరెడ్డి ఏ విధంగా పరిష్కరిస్తారో వేచి చూడాలి.





వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

ఎటిఎం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలో ఉన్న ఎస్‌బిఐ బ్యాంకు ఎటిఎంను పునరుద్ధరించాలని సిపిఎం నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు పలువురు రైతులు సిపిఎం ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో గత 8 నెలల నుంచి ఎస్ బి ఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఎటిఎం పని చేయకపోవడంతో ఖాతాదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇతర అన్ లైన్ సెంటర్లుకు వెళ్లి కమిషన్ ఇచ్చి డబ్బులు తీసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ఎటిఎం ప్రారంభించాలని మేనేజర్‌ను కోరారు. ఎటిఎం మరమ్మతుకు గురైందని బ్యాంకు ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారంలోపు పునరుద్ధరణ చేపడతామని మేనేజర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, వెంకటేష్, రామచంద్ర, లక్ష్మీనారాయణ మంజునాథ్, నరసింహ,నాగరాజు, అశ్వర్థరెడ్డి, వాలే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి దుర్మార్గం

రిలేదీక్షల్లో న్యాయవాదులు

ప్రజాశక్తి - కదిరి టౌన్



రిలే దీక్షల్లో న్యాయవాదులు, తదితరులు

కదిరి పట్టణానికి చెందిన న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కోర్టు సమీపంలో బాధితుడు రామస్వామి నాయుడుతో పాటు పలువురు న్యాయ వాదులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రామస్వామి నాయుడి ఆఫీసులోకి వెళ్లి తలుపుల గంగాధర్, తదితరులు దాడి చేశారన్నారు. అదే రోజున పోలీసులు కేసును నమోదు చేశారని అయితే ఇంత వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని విమర్శించారు. అయితే ఫిర్యాదు ఇచ్చిన తమమైనే కేసు నమోదు చేశారని అన్నారు. న్యాయవాదిపై దాడి జరిగితే ఇంత వరకు నిందితులను కోర్టు పంపకపోతే ఇక సామాన్యుడి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చుని వ్యాఖ్యానించారు. నిందితుడు పట్టణంతోపాటు పోలీస్ స్టేషన్ దగ్గర యథేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన నిందితులను ఆరెస్టు చేయాలన్న డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మొదటి రోజు వివిధ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేంద్ర రెడ్డి, రమేష్ నాయుడు, సురేంద్ర, ప్రభాకర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు కెఎస్. ప్రభాకర్ రెడ్డి, ఎస్. సత్యనారాయణ గుప్తా, పి.రవీంద్రబాబు, ఎల్. లోకేశ్వర రెడ్డి, పిసి భైరవ ప్రసాద్, కాలే నాయక్, చత్రే నాయక్, ,ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములను రక్షించాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని 668-14 సర్వే నెంబర్ లో 0.50 ఎకరాల భూమి అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. చట్టం ప్రకారం ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించారని చెప్పారు. అయితే రామాంజనేయులు అనే వ్యక్తి నకిలీ పట్టాలను సృష్టించి 25 మందికి ఒక్కొక్కరికి నాలుగు సెంట్లు ఇళ్ల స్థలాలు ఉన్నాయని అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు నుండి మూడు సెంట్లు వరకు ఇంటి పట్టా మంజూరు చేయవచ్చన్నారు. ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను దురాక్రమణ చేసి నకిలీ పట్టాల సృష్టించారనిఆయన ఆరోపించారు. రెవిన్యూ రికార్డులలో వారి వివరాలు లేవని నకిలీ పట్టాలతో అంబేద్కర్ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని విమర్శించారు. నకిలీ పట్టాలు సృష్టించి స్థలాల్లో దురాక్రమణ చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు. గతంలో ఇదే విషయంపై ఈ పట్టాలకు సంబంధించిన రికార్డులు లేవని నకిలీ పట్టాలని రెవెన్యూ అధికారులు హైకోర్టుకు తెలిపారని ఆయన గుర్తు చేశారు. ఈ విషయంపై దళితులందరూ ఐకమత్యంతో పోరాటం చేస్తా మని అవసరమైతే చట్టపరంగా న్యాయపోరాటం చేస్తామని ఆయన తెలిపారు. నకిలీ రికార్డులను సృష్టించి భూములను ఆక్రమిస్తున్న వారిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశులు, రవి కుమార్, నరసింహులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాం'



సమావేశంలో పాల్గొన్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-సోమందేపల్లి


ఆలయ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక చౌడేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ డిసి ఈశ్వరయ్య, కమిటీ సభ్యులు సీసీ హరి, తొగట వీర క్షత్రియ, దేవాంగ, పద్మశాలి కులాల పెద్దల సమక్షంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల కాలంలో ఈ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ. 50 వేల అప్పుతో ప్రారంభమైన కమిటీ నేడు లక్షల రూపాయల ఆదాయంతో ముందుకు సాగుతోందన్నారు. ఆలయ కమిటీ సూచన మేరకు అమ్మవారి గుడి ముందు వెనకాల స్థలాలు కొనుగోలు చేసి రహదారి ఏర్పాటు చేశామని, శ్మశాన వాటిక కోసం నాలుగు ఎకరాల భూమిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే కొనుగోలు చేశామని చెప్పారు. ఈ స్థలంలోనే ప్రస్తుతం గ్రామంలో ఎవరైన మృతిచెందింతే అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారని చెప్పారు. మృతిచెందిన వారి అంత్యక్రియలకు ఇబ్బంది కలగకుండా వైకుంతధామం అనే గృహాన్ని నిర్మించామని వివరించారు. ఆలయ ఆవరణంలో భక్తులు కూర్చోవడానికి రేకుల షెడ్ నిర్మించామని నూతన గోపురం నిర్మించామని చెప్పారు. ఉత్సవ సమయంలో భోజనాలు ఏర్పాటు చేయడానికి స్థలం లేకపోవడంతో ఈ మధ్యకాలంలో నాలుగు సెంట్లు భూమిని కూడా కొనుగోలు చేసినట్లు వివరించారు. నందవరం, శ్రీశైలం దేవాలయాలలో గ్రామస్తుల కోసం కమిటీ ఆధ్వర్యంలో వసతిగృహాలు ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామంలోని ప్రజలందరికీ ఉపయోగ కోసం త్వరలోనే వైకుంఠ రథాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆలయ అభివృద్ధి కేవలం ఒక వ్యక్తి వల్ల జరగటం లేదని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందరి సూచనల మేరకు అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ఆలయ అభివృద్ధి కొరకు గ్రామంలోని కులాలకు అతీతంగా సూచనలు సలహాలు తీసుకొని అభివృద్ధి చేస్తామని అంతేకానీ ఒకరిద్దరి నియంతృత్వంతో ఆలయ అభివృద్ధి ఉందనేది అవాస్తవమని చెప్పారు. వచ్చే ఆగస్టులో అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని దీనిని తెలంగాణలో జరిగే బోనాల మాదిరిగా ఘనంగా నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి డిసి అశోక్, మాస్టర్ వీవర్ సిసి హరి, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య, తూముకుంట వెంకటరాముడు, శీలా నారాయణస్వామి, మగ్గాల అంగడి వెంకటేష్, నిమ్మకాయల ప్రసాద్, సీఎన్ లక్ష్మీనారాయణ, బండారు శ్రీనివాసులు, ఎగువింటి రామాంజినేయులు, మహేంద్ర, గోపాల్, దామోదర్, తదితర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

6వ సెమిస్టర్ ఫలితాల్లో


శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

పజాశక్తి - ధర్మవరం టౌన్

ఎస్కే యూనివర్సిటీ ఆరవ సెమిస్టర్ ఫలితాలలో పట్టణంలోని శ్రీ సత్య కృపా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని ఆ కళాశాల కరెస్పాండెంట్ పెద్దిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థర్డ్ బీకాంలో డి. చందన 83 శాతం, ఎం. శ్రావణి 82, పి. తరుణి 81, వి ఇందిరా 80 శాతం మార్కులు సాధించారన్నారు. ధర్మవరం పట్టణంలోనే అత్యధిక మార్కులు సాధించిన ఏకైక మహిళా డిగ్రీ కళాశాలగా తమ సత్యకృపా మహిళా డిగ్రీ కళాశాల నిలిచిందని ఆయన తెలిపారు. అనంతరం ప్రతిభ కనపరిచిన విద్యార్థినులను కరెస్పాండెంట్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థినులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న ప్రతిభా విద్యార్థులు, పాఠశాల సిబ్బంది



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - పరిగి

గ్రామీణ ప్రాంతాలలో విష జ్వరాలు ప్రబలుతున్న వేళ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ మంజువాణి అధికారులను ఆదేశించారు. పరిగి మండలంలోని శ్రీరంగరాజు పల్లి గ్రామంలో డెంగీ కేసు నమోదుఅవడంతో అప్రమత్తమైన అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ చేతన్ జిల్లా స్థాయి అధికారులను అప్రమత్తం చేసి గ్రామంలో పర్యటించి రిపోర్టు పంపించి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో డిఎంహెచ్ఒ మంజువాణి మంగళవారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆమె పలు రికార్డులను పరిశీలించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం మీటింగ్ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించేలా సిఫార్సు చేయాలని ఆమెను డాక్టర్లు నవీన స్వరూప రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వన్నప్ప సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని మాల్యవంతం సమీపంలో ఈ నెల 8వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. తాడిమర్రి మండలం నార్శింపల్లి గ్రామానికి చెందిన 16 మంది కూలీలు ఈ నెల 8వ తేదీన నార్పల మండలానికి చీనీ కాయల కోతకు బొలెరో వాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బత్తలపల్లి మండలం మాల్యవంతం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సారే వీరనారమ్మ(48) అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలికి కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురిలో ఒకరు మృతి చెందారు. ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని మాల్యవంతం సమీపంలోని కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మాల్యవంతం సమీపంలోని కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్దకు సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తచ్చాడుతూ ఉండగా అక్కడున్న వారు ఆయనను విచారించారు. అతను నీరసంగా ఉండటంతో అన్నం పెట్టినట్లు తెలిపారు. అన్నం తిన్న తరువాత అక్కడే పడుకొని ఉండి నిద్రలోనే మృతిచెందాడు. మంగళవారం ఉదయం ఆశ్రమంలోని వారు ఎంతలేపినా లేవకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా మొహంపైన, చేతులపైన అక్కడక్కడ గోరుడు గాయాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. మృతుని ఆచూకీ కోసం ప్రయత్నించగా ఎలాంటి ఆధారం అభ్యంకాలేదన్నారు. దీంతో మృతదేహాన్ని బత్తలపల్లిలోని మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

కదిరిలో మరో వ్యక్తి ...

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రైల్వే స్టేషన్ సమీపాన నల్లచెరువు వైపునకు వెళ్లే దారిలో సిమెంట్ దిమ్మెపై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని కదిరి రైల్వే ఎస్ఐ రహీమ్ తెలిపారు. ఇతని ఆచూకీ తెలిస్తే కదిరి ఎస్ఐ రహీంను సంప్రదించాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు...

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని రెక్క మానులో మంగళవారం విద్యుత్ షాక్‌తో ఆవు మృతిచెందింది. వబాధితుడు పెద్ది నాయుడు తెలిపిన వివరాలు.. రోజువారీగా మేతకు ఆవులను తీసుకెళ్లానని ఆసమయంలో భూమిపై ఉన్న విద్యుత్ తీగలను తగిలిన ఆవు షాక్‌కు గురై మృతిచెందిందని చెప్పారు. దీంతో తనకు దాదాపు 50 వేల రూపాయలు నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

అమ్మను బస్టాండ్‌లో వదిలేసిన కుమారుడు

ప్రజాశక్తి-హిందూపురం

ఇప్పుడే వస్తాను..అని చెప్పి కన్న తల్లిని ఆమె కుమారుడు హిందూపురం బస్టాండ్ లో వదిలి వెళ్లిన సంఘటన సోమవారం రాత్రి వెలుగు చూసింది. అందుకు సంబందించిన వివరాలు... కర్నాటక రాష్ట్రం చిక్కబళాపుర జిల్లా ఎస్ ఆర్ పల్లికి చెందిన లక్ష్మి అనే వృద్ధురాలిని ఆమె కుమారుడు సోమవారం హిందూపురం పిలుచుకువచ్చాడు. బస్టాండ్ లో ఓ దుకాణం వద్ద కుర్చోమని చెప్పి ఊడాయించాడు. అయితే ఆవృద్దురాలు తన కుమారుడు వస్తాడని రాత్రి వరకు వేచి చూసింది. విషయాన్ని గమనించిన అక్కడ ఉన్న కొంత మంది పట్టణంలోని అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు అమన్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే తన స్నేహితులతో కలిసి అక్కడికి చేరకుని ఆ వృద్దురాలితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాము ఉన్నామని ఆమెకు ధైర్యం చెప్పి పట్టణంలోని లక్ష్మీపురంలో ఉన్న వృద్ధాశ్రమంలో ఆమెను చేర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి ఉమర్ ఫారూఖ్, జాయింట్ కార్యదర్శి ఉస్మాన్, రిహాన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైసిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలోని కె.శివరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు శివకుమార్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్ గౌడ, తిమ్మప్ప, దివాకర్, శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

ఆటో నగర్ బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డులో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్‌డిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిపిఐ నాయకులు హసీబ్, మౌలానా అంజాద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మడకశిర పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుండి బేగార్లపల్లి క్రాస్ వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల, వసతిగృహాలు ఉన్నాయి. దీనితోపాటు నివాసగృహాలు కూడా నిర్మించుకుంటున్నారు. గురుకుల పాఠశాలలో మహిళా సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. చీకటి సమయంలో రావడానికి వెళ్లడానికి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాల కొండ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. సాయంత్రం, వేకువజాము సమయాలలో వన్యప్రాణులు సంచరిస్తూ రోడ్డును దాటుతూ ఉంటాయి. దీనివలన ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ మార్గం నుండి నిత్యం అధికారులు ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా ఇక్కడ వీధిలైట్లు లేవని గమనించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కరువైందని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు పైపల్లి గంగాధర్ వాపోయారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల దూరహంకారంతో బలైపోతున్న ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన దళిత, గిరిజనులపైన దాడులు జరుగుతూ ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా దళిత గిరిజన బతుకులు మాత్రం మారడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులను ఆదుకోవాలని అన్నారు.

'జలజీవన్' పనుల పరిశీలన

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలో హేమావతిగ్రామంలో జల జీవన్ మిషన్ కింద జరిగిన పనులను కేంద్రబృందం అధికారులు అనిల్ కుమార్, శిశిర్ కుమార్ బషీర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హేమావతి గ్రామంలోని త్రాగునీటి కొళాయి కనెక్షన్లు, స్వచ్ఛభారత్ వర్మి కంపోస్ట్ షెడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం నందు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ మనో నాయక్, ఎఇ ప్రత్యూష, ఈవోఆర్డీ నాగ ముని, గ్రామ కార్యదర్శి నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్.

శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటీ ప్రకటించిన 6వ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచినారని ఆ కళాశాల చైర్మన్ చిన్నపరెడ్డి, కళాశాల డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్సీ నందు 87 మంది విద్యార్థులకు గాను 79 మంది విద్యార్థులు ఇంటర్‌షిప్ ఫలితాలలో 90 శాతానికి పైగా మార్కులను సాధించారని చెప్పారు. బీకాంలో వసుంధర 85, జి సౌమ్య 82, పి. చంద్రకళ 81, జి.గౌతమి 80, సి. భార్గవ 79, మహమ్మద్ సాదిక్ 79, సుకన్య 79, హారిక 79 శాతం మార్కులను సాధించారని తెలిపారు. కళాశాల పాస్ పర్సంటేజ్ 86 శాతం అని చెప్పారు. ఇంతటి విజయాన్ని అందించిన విద్యార్థులకు, అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హర్షవర్ధన్, ఏవో రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల పర్యటన

బత్తలపల్లి : హిందూ, ముస్లిం సోదరులు ఐక్యంగా జరుపుకునే మొహరం వేడుకలను జనజీవనానికి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం రాత్రి మండలంలోని గంటాపురం, పోట్లమర్రి, వేల్పుమడుగు, రాఘవంపల్లి. ఈదుల ముష్టూరు, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అనంతసాగరం గ్రామాలతో పాటు పలు గ్రామాలలో పర్యటించి గ్రామ పెద్దలకు పలు సూచనలు, సలహాలు అందించారు.